సాక్షి
ఆదిలాబాద్
మంగళవారం । 1 । అక్టోబర్ । 2024



సర్వేకు బ్రేక్!
జిల్లాలోని ఆయా చెరువుల ఆక్రమణల గుర్తింపు సర్వే ప్రక్రియకు ఆదిలోనే బ్రేక్ పడింది. 9లో▸



ముందస్తు బతుకమ్మ సంబురాలు
జిల్లాలో పలుచోట్ల ముందస్తు బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. తీరొక్క పూలతో పేర్చిన బతుకమ్మలతో ఆడిపాడారు. 9లో▸

గరిష్టం/కనిష్టం
34.0/26.0

వాతావరణం
వాతావరణం పొడిగా ఉంటుంది. సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. గాలిలో తేమ శాతం పెరగనుంది.

న్యూస్‌రీల్

పట్టభద్రుల ఓటర్ల నమోదు షురూ

- నవంబర్ 6వరకు అవకాశం

కైలాస్‌నగర్: పట్టభద్రులు, ఉపాధ్యాయ మండలి ఎన్నికలకు సంబంధించిన ఓటరు నమోదు కార్యక్రమం సోమవారం నుంచి ప్రారంభమైనట్లు జిల్లా ఉపఎన్నికల అధికారి, అదనపు కలెక్టర్ శ్యామలాదేవి ప్రకటనలో తెలిపారు. ఉట్నూర్‌లోని సబ్‌కలెక్టర్, ఆదిలాబాద్‌లోని ఆర్డీవో కార్యాలయాలతో పాటు జిల్లాలోని అన్ని తహసీల్దార్ కార్యాలయాల్లో పబ్లిక్ నోటీసును జారీ చేసినట్లుగా తెలిపారు. ఓటరుగా నమోదు కోసం పట్టభద్రులు ఫారం–18, ఉపాధ్యాయులు ఫారం–19 ద్వారా తమ దరఖాస్తులను తహసీల్దార్ కార్యాలయాల్లో నవంబర్ 6వరకు అందజేయాలని సూచించారు. 23.11.24 నుంచి 09.12.24 వరకు సవరణలు, అక్షేపణలకు సంబంధించి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. డిసెంబర్ 30న ఓటర్ల తుదిజాబితా ప్రకటించనున్నట్లు వెల్లడించారు.

ఉద్యోగ విరమణ సహజమే



సన్మానిస్తున్న ఎస్పీ గౌస్ ఆలం

ఆదిలాబాద్‌టౌన్: ప్రభుత్వ ఉద్యోగులకు ఉద్యోగ విరమణ సహజమని ఎస్పీ గౌస్ ఆలం అన్నారు. జిల్లాలో సుదీర్ఘకాలం పాటు సేవలు అందించి ఉద్యోగ విరమణ పొందిన నలుగురు పోలీసు అధికారులను సన్మానించారు. అనంతరం వారిని ప్రభుత్వ వాహనంలో ఇంటి వరకు సాగనంపారు. ఉద్యోగ విరమణ పొందిన వారిలో ఎస్సై ఎం.ఊశన్న, ట్రాఫిక్ ఎస్సై ఎస్‌డీ ఖాజా మొయినొద్దీన్, అసిస్టెంట్ రిజర్వ్ సబ్‌ఇన్‌స్పెక్టర్ యువరాజ్, సిరికొండ హెడ్‌కానిస్టేబల్ లింగన్న ఉన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ సురేందర్‌రావు, డీఎస్పీ బి.సురేందర్ రెడ్డి, సీసీ దుర్గం శ్రీనివాస్, పోలీసు అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

యువత ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవాలి

గుడిహత్నూర్: గ్రామీణ యువత ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని ముందుకు సాగాలని ఎస్పీ గౌస్ ఆలం అన్నారు. మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో ఏర్పాటు చేసిన జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలను సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. క్రీడలతో నాయకత్వ లక్షణాలు, పోటీతత్వం, ఆత్మవిశ్వాసం పెంపొందుతాయన్నారు. యువత ఫిట్‌నెస్‌తో పాటు చదువులో రాణించి రక్షణ, పోలీసు రంగాల్లో ఉద్యోగాలను సాధించాలని సూచించారు. ఈ టోర్నీలో 67 జట్లు పాల్గొంటున్నట్లు సిబ్బంది తెలిపారు. ఇందులో డీఎస్పీ నాగేందర్, సీఐ భూమేష్, ఎస్సైలు ఇమ్రాన్, తిరుపతి, శ్రీకాంత్, పీడీలు అశోక్‌రెడ్డి, సత్యనారాయణగౌడ్, కె.కృష్ణ, జె.సాయికుమార్, వినోద్, తదితరులు ఉన్నారు.

క్రికెట్‌తో ఉజ్వల భవిష్యత్తు

ఆదిలాబాద్: క్రికెట్‌తో ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని జిల్లా గిరిజన క్రీడల అధికారి కోరెడ్డి పార్థసారథి అన్నారు. జిల్లా కేంద్రంలోని దస్నాపూర్ కాలనీలో గల సూపర్ టీ20 స్టేడియంలో ఎస్జీఎఫ్ అండర్–14 బాలుర క్రికెట్ జట్టు ఎంపిక పోటీలను సోమవారం ఆయన ప్రారంభించారు. నిరంతరం సాధన చేస్తేనే నైపుణ్యాలు అలవర్చుకోవచ్చని అన్నారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారే జోనల్, రాష్ట్ర, జాతీయస్థాయి పోటీలకు ఎంపిక అవుతారని వెల్లడించారు. ఎస్జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కాంతారావు మాట్లాడుతూ జిల్లాస్థాయిలో ప్రతిభ కనబరిచిన వారు ఈ నెల 2న నిర్మల్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించనున్న జోనల్‌స్థాయి పోటీలకు ఎంపిక అవుతారని తెలిపారు. ఈ పోటీలకు ఉమ్మడి జిల్లాకు చెందిన క్రీడాకారులు హాజరవుతారన్నారు. ఇందులో పోటీల కన్వీనర్ రాష్ట్రపాల్, స్టేడియం నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

నేడు వయోవృద్ధుల దినోత్సవం

ఆదిలాబాద్‌టౌన్: అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవంను జిల్లా కేంద్రంలోని జెడ్పీ సమావేశ మందిరంలో మంగళవారం ఉదయం 11గంటలకు నిర్వహించనున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి ఎం.సబిత ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి వయోవృద్ధులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. వైద్యారోగ్య శాఖ, రిమ్స్ ఆధ్వర్యంలో ఉదయం 9 గంటలకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

జిన్నింగ్ మిల్లులో పత్తి నిల్వలు (ఫైల్)



పత్తి సాగు, దిగుబడుల వివరాలు (ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో)..
సాగు విస్తీర్ణం: 10.26 లక్షల ఎకరాలు
దిగుబడి అంచనా: సుమారు 80 లక్షల క్వింటాళ్లు
సీసీఐ కొనుగోలు కేంద్రాలు: 24
కనీస మద్దతు ధర: రూ.7,521

కొలిక్కి వచ్చేనా..

- ఇంకా పూర్తికాని సీసీఐ కొనుగోలు కేంద్రాల టెండర్లు
- కొనసాగుతున్న జిన్నింగ్ మిల్లుల లీజు ప్రక్రియ
- ఉమ్మడి జిల్లాలో పత్తి కొనుగోళ్ల కోసం ఏర్పాట్లు

సాక్షి,ఆదిలాబాద్: కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (భారత పత్తి సంస్థ)కు దేశంలోని అనేక రాష్ట్రాల్లో బ్రాంచీలు విస్తరించి ఉన్నాయి. తెలంగాణలో ఉన్న మూడింటిలో ఒకటి ఆదిలాబాద్‌లో ఉంది. సీసీఐకి సంబంధించిను ఆఫీసులు కూడా అద్దె భవనాల్లోనే కొనసాగుతాయి. వాటికి సొంతగా ఆస్తులు లేవు. ఇదిలా ఉంటే ఏటా పత్తి కొనుగోలు సీజన్ సమీపిస్తుండగా, క్షేత్రస్థాయిలో జిన్నింగ్ మిల్లులను లీజులు తీసుకుంటుంది. ప్రధానంగా పత్తి కొనుగోళ్ల సమయంలో మార్కెట్లో మద్దతు ధర (ఎంఎస్‌పీ) నిలకడగా లేకపోతే సీసీఐ రంగంలోకి దిగుతుంది. కొన్ని సమయాల్లో కమర్షియల్ కొనుగోలు కూడా చేపడుతుంది. ఇలా రైతుల నుంచి కొనుగోలు చేసిన పత్తి నుంచి దూది, విత్తనాలను వేరు చేయడం, దూదితో పత్తి బేళ్లను తయారు చేయడం జరుగుతుంది. ఇలా లీజుకు తీసుకున్న జిన్నింగ్ మిల్లుల ద్వారా ఈ ప్రక్రియ చేపడుతుంది. ఈ జిన్నింగ్ మిల్లులను లీజుకు తీసుకునేందుకు ఏటా టెండర్లు నిర్వహిస్తుంది.

కొనసాగుతున్న టెండర్ ప్రక్రియ

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 24 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని సీసీఐ నిర్ణయం తీసుకుంది. దీనికి అనుగుణంగా ఆయా ప్రాంతాల్లో జిన్నింగ్ మిల్లులను లీజుకు తీసుకోవాల్సి ఉంది. ఇందుకోసం గత ఆగస్టులోనే టెండర్లు నిర్వహించినప్పటికీ జిన్నింగ్ మిల్లు యజమానులు పలు నిబంధనలు వ్యతిరేకిస్తూ వాటికి దూరంగా ఉన్నారు. రైతుల నుంచి పత్తిని కొనుగోలు చేసే సీసీఐ స్థానిక జిన్నింగ్‌లను అద్దెకు తీసుకొని బేళ్లు తయారు చేసేలా ఒప్పందం చేసుకుంటుంది. ఇందుకోసం జిన్నింగ్‌లలో సౌకర్యాలతో పాటు కొన్ని నిబంధనలను పరిశీలన చేస్తుంది. ఈ సీజన్‌లో కొన్ని కొత్త నిబంధనలను అమలులోకి తేవడంతో వ్యాపారులు వాటిని వ్యతిరేకించారు. మిల్లుల్లో షెడ్‌లు ఏర్పాటు చేయాలనే నిబంధన లక్షల రూపాయలతో కూడుకున్నది కావడంతో వ్యాపారులు వ్యతిరేకించారు. ఈ విషయంలో సీసీఐ నుంచి కొన్ని సడలింపులు ఇవ్వడం ద్వారా మళ్లీ టెండర్లు పిలవగా, వ్యాపారుల నుంచి రెస్పాన్స్ వచ్చింది. తాజాగా టెండర్ ప్రక్రియలో టెక్నికల్ బిడ్ అంశం పూర్తయింది. ఇక ఫైనాన్షియల్ బిడ్ తెరవాల్సి ఉంది. ఆ తర్వాత అగ్రిమెంట్ చేసుకోవడం జరుగుతుంది. ఇది పూర్తయితే సీసీఐ పత్తి కొనుగోలుకు సిద్ధమవుతుంది. లీజుకు తీసుకున్న జిన్నింగ్‌లలో సీసీఐ అధికారులు కొనుగోలు ప్రక్రియ నిర్వహిస్తారు. ఇకపోతే జిన్నింగ్ అండ్ ప్రెస్సింగ్ పూర్తిగా వ్యాపారుల నిర్వహణలో ఉంటుంది. దీనికి సంబంధించి కూలీలను కూడా జిన్నింగ్ యజమానులే ఏర్పాటు చేయాలి. కాగా ఒక్క బేళ్ తయారీకి గతేడాది సీసీఐ నుంచి జిన్నింగ్ వ్యాపారులు రూ.1,345 ఇవ్వడం జరిగింది. ఈ సారి ధర ఫైనాన్షియల్ బిడ్‌లో నిర్ణయం తీసుకోవడం జరిగింది.

సాగు విస్తీర్ణం ఇలా..

ఉమ్మడి జిల్లాలో ఆదిలాబాద్‌లో 3లక్షల 97వేల ఎకరాలు, ఆసిఫాబాద్‌లో 3లక్షల 40వేల ఎకరాలు, నిర్మల్‌లో 1లక్ష 47వేల ఎకరాలు, మంచిర్యాలలో 1లక్షల 42వేల ఎకరాల్లో ఈసారి పత్తి సాగైంది. వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ అంచనా ప్రకారం ఎకరాకు 7 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని అంచనా. మరికొద్ది రోజుల్లో పంట చేతికి రానుంది. ఆ సమయంలో కొనుగోళ్లు ప్రారంభించాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి.

- సీసీఐ ఆధ్వర్యంలో ఆదిలాబాద్ జిల్లాలో 11 కేంద్రాలు ఏర్పాటు చేస్తుండగా.. అందులో జిల్లా కేంద్రంలో ఏ,బి రెండు కేంద్రాలు, బేల, బోథ్, ఇచ్చోడ, గుడిహత్నూర్, ఇంద్రవెల్లి, నార్నూర్, నేరడిగొండ, పొచ్చెర, సొనాల ఉన్నాయి.
- కుమురంభీం ఆసిఫాబాద్‌లో ఐదు కేంద్రాలు ఏర్పాటు చేస్తుండగా.. ఆసిఫాబాద్, జైనూర్, కొండపల్లి, కౌటాల, వాంకిడి ఉన్నాయి.
- నిర్మల్ జిల్లాలో నాలుగు కేంద్రాలు ఏర్పాటు చేస్తుండగా.. భైంసా, కుబీర్, సారంగాపూర్, నిర్మల్ ఉన్నాయి.
- మంచిర్యాల జిల్లాలో నాలుగు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తుండగా, బెల్లంపల్లి, చెన్నూర్, ఇందారం, లక్సెట్టిపేట అందులో ఉన్నాయి.

ఆదిలాబాద్ సీసీఐ బ్రాంచి కార్యాలయ పర్యవేక్షణలో ఈ కొనుగోలు కేంద్రాల్లో ప్రక్రియ కొనసాగుతుంది.

టెండర్ ప్రక్రియ కొలిక్కి వస్తుంది..

సీసీఐ ఆధ్వర్యంలో జిన్నింగ్‌ల లీజుకు సంబంధించి టెండర్ ప్రక్రియ కొలిక్కి వస్తుంది. త్వరలోనే అన్ని అంశాలను పూర్తిచేస్తాం. పత్తి కొనుగోళ్లకు సంబంధించి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఏర్పాట్లు వేగిరం చేశాం.
– ఆద్య మిశ్రా, సీసీఐ జీఎం, ఆదిలాబాద్ బ్రాంచి కార్యాలయం

3న పత్తి కొనుగోళ్లపై సన్నాహక సమావేశం

కైలాస్‌నగర్: 2024–25 సంవత్సరానికి గాను ఖరీఫ్ సీజన్ పత్తి కొనుగోళ్లకు సంబంధించి ఈనెల 3న సన్నాహక సమావేశం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ రాజర్షి షా ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు కలెక్టరేట్ సమావేశం మందిరంలో నిర్వహించే ఈ సమావేశానికి మార్కెటింగ్, అనుబంధ శాఖల అధికారులు, వ్యాపారులు సకాలంలో హాజరు కావాలని పేర్కొన్నారు.

డీఎస్సీ ఫలితాలొచ్చాయ్

- నేటి నుంచి సర్టిఫికెట్ల పరిశీలన
- జిల్లాలో భర్తీ కానున్న 324 పోస్టులు
- సత్తా చాటిన అభ్యర్థుల్లో ఆనందం

ఆదిలాబాద్‌టౌన్: ప్రభుత్వం ఎట్టకేలకు డీఎస్సీ ఫలితాలను సోమవారం విడుదల చేసింది. పరీక్షలు రాసి ఫలితాల కోసం నిరీక్షిస్తున్న అభ్యర్థులకు తీపి కబురు అందించింది. 2017 డీఎస్సీ తర్వాత ఉపాధ్యాయ నియామకాలు జరగలేదు. గత ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసినప్పటికీ ఎన్నికలు రావడంతో వాయిదా పడ్డాయి. తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ప్రకటించింది. ఆన్‌లైన్ ద్వారా పరీక్షలు నిర్వహించి ఫలితాలను విడుదల చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా 11,062 పోస్టులు భర్తీ కానుండగా, జిల్లాలో 324 పోస్టులు భర్తీ చేయనున్నారు. ఈ ఫలితాల్లో ఉత్తమ ర్యాంకు సాధించిన అభ్యర్థుల్లో హర్షం వ్యక్తమవుతోంది. మరోవైపు ఉపాధ్యాయ పోస్టులు భర్తీ కానుండడంతో సర్కారు బడుల్లో విద్యను అభ్యసిస్తున్న పేద విద్యార్థులకు సైతం మేలు చేకూరనుంది.

భర్తీ కానున్న పోస్టులు..

జిల్లాలో ఉపాధ్యాయుల కొరత ఉండడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చాలా పాఠశాలల్లో ఏకోపాధ్యాయులతోనే బోధన సాగుతోంది. 5 తరగతులకు ఒకే ఒక ఉపాధ్యాయుడు ఉండడంతో అవస్థలు ఎదురవుతున్నాయి. ఇటీవల బదిలీ అయిన ఉపాధ్యాయులకు సైతం రిలీవర్ లేకపోవడంతో వారు పాత స్థానంలోనే విధులు నిర్వహిస్తున్నారు. డీఎస్సీ ద్వారా నియామకమైన తర్వాత బదిలీ అయిన ఉపాధ్యాయులు వారి స్థానాలకు వెళ్లనున్నారు. జిల్లాలో 342 పోస్టులు భర్తీ కానున్నాయి. వీటిలో 74 స్కూల్ అసిస్టెంట్, 14 లాంగ్వేజ్ పండిత్ పోస్టులు,రెండు పీఈటీ పోస్టులు, 209 ఎస్జీటీ పోస్టులు, 6 ప్రత్యేక స్కూల్ అసిస్టెంట్ పోస్టులు, 19 ప్రత్యేక ఎస్జీటీ పోస్టులు భర్తీ చేయనున్నారు.

సత్తా చాటిన పలువురు..

డీఎస్సీ ఫలితాల్లో జిల్లా విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. పట్టణంలోని ఖుర్షీదాపూర్ కాలనీకి చెందిన గిన్నెల ప్రవళిక ఎస్జీటీ విభాగంలో మొదటి ర్యాంకు సాధించింది. యాపల్‌గూడకు చెందినకొప్పుల అనిల్‌కుమార్ తెలుగు పండిత్‌లో రెండో ర్యాంక్ సాధించాడు. ఇచ్చోడకు చెందిన సాయిచందనరెడ్డి స్కూల్ అసిస్టెంట్ గణితంలో రెండో ర్యాంకు సాధించింది. ఆదిలాబాద్ శ్రీనగర్ కాలనీకి చెందిన నీరజ్ సుధాం స్కూల్ అసిస్టెంట్ సాంఘిక శాస్త్రంలో మొదటి ర్యాంక్ సాధించాడు. పట్టణంలోని రాంనగర్‌కు చెందిన తాటి కిరణ్ ఎస్జీటీ విభాగంలో 10వ ర్యాంక్ సాధించాడు. నేరడిగొండ మండలం వెంకటాపూర్‌కు చెందిన రాథోడ్ సంధ్యారాణి ఎస్జీటీ కేటగిరిలో ఒకటో ర్యాంక్ సాధించింది. వడూర్ గ్రామానికి చెందిన ద్యావంత్ సుమన్ ఎస్ఏ ఇంగ్లిష్ విభాగంలో 7వ ర్యాంక్ సాధించాడు. అలాగే చౌక్కపెల్లి శివకృష్ణ ఎస్జీటీ విభాగంలో 4వ ర్యాంకు సాధించాడు.

నేటి నుంచి సర్టిఫికెట్ల పరిశీలన..

డీఎస్సీ 2024లో అర్హత సాధించిన అభ్యర్థుల సర్టిఫికెట్లను ఈ నెల 1నుంచి 5 వరకు ప్రభుత్వ డైట్ కళాశాలలో పరిశీలించడం జరుగుతుంది. 1:3 నిష్పత్తిలో అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలిస్తాం. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే ఈ ప్రక్రియకు అభ్యర్థులు హాజరు కావాలి. అభ్యర్థులు విద్యార్హత, బోనఫైడ్, కుల, ఆధార్‌కార్డు, ఇతర ఒరిజినల్ సర్టిఫికెట్లు, రెండు సెట్ల (గెజిటెడ్ ఆఫీసర్ అటెస్టెడ్ చేయించినవి) పత్రాలు వెంట తీసుకురావాలి. www. schooledu. telangana. gov. in వెబ్‌సైట్ ద్వారా అప్లికేషన్ డౌన్‌లోడ్ చేసి అందించాలి.
– ప్రణీత, డీఈవో

గురువంటే గౌరవం.. శిష్యుడంటే అభిమానం



తన గురువు ముందు ఉపాధ్యాయులతో కలిసి కూర్చున్న రావుల శంకర్



శంకర్‌ను ప్రధానోపాధ్యాయుడి కుర్చీలో కూర్చోబెడుతున్న సురేశ్

బోథ్: ఆయనకు హెచ్‌ఎంగా ప్రమోషన్ వచ్చింది.. అయినా కుర్చీలో కూర్చోవడానికి రెండు నెలలు పట్టింది. అందుకు కారణం తన గురువుపై ఉన్న గౌరవం. ప్రధానోపాధ్యాయుడిగా ఆ పాఠశాలలో అడుగుపెట్టిన సందర్భంలో తన గురువే అక్కడ ఉపాధ్యాయుడిగా ఉండడంతో ఆయన ముందు ఉన్నత స్థానంలో కూర్చోలేకపోయాడు. సీన్ కట్ చేస్తే.. ఆ గురువు సోమవారం ఉద్యోగ విరమణ చేశాడు. తిరిగి తన శిష్యుడిని ప్రధానోపాధ్యాయ కుర్చీలో కూర్చోబెట్టి గురుశిష్యుల బంధాన్ని ఇనుమడింపజేశారు. ఈ ఘటన బోథ్ మండలం దన్నూర్ బి మండల పరిషత్ పాఠశాలలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. బోథ్ మండల కేంద్రానికి చెందిన రావుల శంకర్ మండలంలోని హనుమాన్ ప్రాథమిక పాఠశాల నుంచి ఇటీవల జరిగిన బదిలీల్లో హెచ్‌ఎంగా ప్రమోషన్‌పై దన్నూర్ పాఠశాలకు వచ్చారు. ఈక్రమంలో తనగురువైన వైద్య సురేశ్ అక్కడ ఎస్జీటీగా విధుల్లో ఉన్నారు. చిన్నతనంలో తనకు విద్యాబుద్ధులు నేర్పిన సార్ కావడంతో ఆయన ముందు ప్రధానోపాధ్యాయుడి కుర్చీలోకూర్చునేందుకు అతడి మనసు అంగీకరించలేదు. మిగతా ఉపాధ్యాయులతో కలిసి కూర్చుండి తన గురువుకు గౌరవం ఇచ్చారు. సోమవారం సురేశ్ పదవీ విరమణ పొందారు. స్వయంగా ఆయనే శంకర్‌ను ప్రధానోపాధ్యాయుడి కుర్చీలో కూర్చుండబెట్టారు. ఈ ఘట్టం వారి ఆత్మీయ బంధానికి ప్రతీకగా నిలిచింది.

గోడు వినండి.. గోస తీర్చండి



సమస్యలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ రాజర్షి షా

- కలెక్టర్ రాజర్షి షాకు బాధితుల మొర
- ప్రజావాణికి 59 అర్జీలు

కైలాస్‌నగర్: తమ గోడు ఆలకించి గోస దూరం చేసేలా తగు చర్యలు తీసుకోవాలని పలువురు బాధితులు కలెక్టర్ రాజర్షి షాను వేడుకున్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో అదనపు కలెక్టర్ శ్యామలాదేవితో కలిసి కలెక్టర్ అర్జీలు స్వీకరించారు. బాధితుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. దరఖాస్తులను సంబంధిత అధికారులకు అందజేస్తూ త్వరితగతిన పరిష్కరించాల్సిందిగా ఆదేశించారు. కాగా, ఈ వారం వివిధ సమస్యలకు సంబంధించి మొత్తం 59 అర్జీలు అందాయి. అందులో కొందరి నివేదిన వారి మాటల్లోనే.

మాకు న్యాయం చేయండి



మేము జిల్లా కేంద్రంలోని సిమెంట్ ఫ్యాక్టరీ (సీసీఐ) ఏర్పాటు కోసం 772 ఎకరాల పంట పొలాలను ఇచ్చాము. ఫ్యాక్టరీ ఏర్పాటైతే మాకు ఉపాధితో పాటు గ్రామాల అభివృద్ధికి సైతం చేయూతనందిస్తామని సీసీఐ యాజమాన్యం అప్పుడు హామీ ఇచ్చింది. అయితే సీసీఐ మూతపడటంతో భూములు కోల్పోయిన మాకు ఎలాంటి ప్రయోజనం దక్కలేదు. పైగా ఆ భూములన్నీ బహిరంగ వేలం ద్వారా విక్రయించాలని సీసీఐ యాజమాన్యం నిర్ణయించినట్లుగా తెలుస్తోంది. దీనిపై కోర్టులో కేసు నడుస్తున్నందున విక్రయ నిర్ణయాన్ని విరమించుకుని మాకు న్యాయం జరిగేలా చూడాలి.
– సీసీఐకి భూములిచ్చిన రైతులు, ఆదిలాబాద్

మున్సిపాలిటీలో కలుపొద్దు



మా గ్రామం అభివృద్ధికి ఆమడదూరాన ఉంది. ప్రభుత్వాలు మారినా ప్రజల బతుకుల్లో ఎలాంటి మార్పు రాలేదు. దళితులు, వెనుకబడిన వర్గాల ప్రజలు ఇప్పటికే అనేక సంక్షేమ పథకాలను నష్టపోతున్నారు. పైగా 80శాతం మంది గ్రామస్తులు కూలీపైనే ఆధారపడి జీవిస్తున్నారు. ఆదిలాబాద్ మున్సిపల్‌లో మా గ్రామాన్ని విలీనం చేస్తున్నట్లుగా తెలుస్తోంది. అలా చేస్తే మేము ఉపాధి హామీ పనులకు దూరమై పస్తులతో గడపాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఈ మేరకు ఆ ఆలోచనను అధికారులు విరమించుకోవాలి.
– పొచ్చెర గ్రామస్తులు, ఆదిలాబాద్ రూరల్

గోవధశాల నిర్మాణం ఆపాలి..



పట్టణంలోని బంగారుగూడ డంపింగ్‌యార్డులో మున్సిపల్ అధికారులు గోవధశాల నిర్మిస్తున్నారు. దాన్ని ఆనుకునే అనుకుంట, కచ్‌కంటి, చిట్యాలబోరి, బంగారుగూడ రైతుల వ్యవసాయ భూములున్నాయి. పక్కనే ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలతో పాటు కేజీబీవీ, మోడల్ స్కూల్, మైనార్టీ విద్యాలయం వంటివి ఉన్నాయి. గోవధశాల ప్రారంభిస్తే అక్కడి నుంచి వచ్చే వాసనతో విద్యార్థులతో పాటు రైతులు ఇబ్బందులు పడాల్సి వస్తుంది. అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉంది. కాబట్టి నిర్మాణ పనులు వెంటనే నిలిపివేసి ఆయా ప్రాంతాల ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలి.
– బంగారుగూడ కాలనీవాసులు, ఆదిలాబాద్

ఆ భూమిని 'ధరణి' నుంచి తొలగించాలి



మేమంతా జైనథ్ మండలకేంద్రంలోని వ్యవసాయ భూమిలో ఏర్పాటు చేసిన లేఅవుట్‌లోని ప్లాట్లను 30ఏళ్ల క్రితం కొనుగోలు చేశాం. అందులో ఇళ్లు నిర్మించుకుని ఏళ్లుగా నివసిస్తున్నాం. మాకు ప్రభుత్వం విద్యుత్‌తో పాటు సీసీ రోడ్లు వంటి సౌకర్యాలను కల్పించింది. కానీ మాకు ప్లాట్లను విక్రయించిన యజమాని మరణించడంతో ఆయన వారసులు ఆ భూమిని తిరిగి ధరణిలో వ్యవసాయ భూమిగా మార్చుకుని రైతుబంధు, రైతు బీమా వంటి ప్రయోజనాలు పొందుతున్నారు. దీంతో భవిష్యత్తులో మాకు నష్టం కలిగే అవకాశమున్నందున విచారించి మాకు న్యాయం చేయాలి.
– జైనథ్ గ్రామస్తులు, జైనథ్

వేతనం అడిగితే ఉపాధికి దూరం చేశారు



ఆదిలాబాద్‌కు చెందిన నేను జిల్లా సమాచారశాఖ అధికారి కార్యాలయంలో రెండు నెలల పాటు డ్రైవర్‌గా పనిచేశాను. అయితే డీపీఆర్వో నాకు ఒక నెల వేతనం మాత్రమే చెల్లించారు. మరో నెల వేతనం ఇవ్వాలని అడుగగా రేపటి నుంచి విధులకు రావద్దని చెబుతూ నన్ను తొలగించి ఉపాధికి దూరం చేశారు. దీనిపై విచారించి వేతనంతో పాటు విధుల్లో కొనసాగించేలా చర్యలు తీసుకుని న్యాయం చేయాలి.
– రాజు, డీపీఆర్వో కార్యాలయ తాత్కాలిక డ్రైవర్

పేదల ఇంటిస్థలాలకు పట్టాలివ్వాలి



ధర్నాలో పాల్గొన్న సీపీఐ నాయకులు

కైలాస్‌నగర్: ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలు వేసుకుని జీవిస్తున్న నిరుపేదలకు ఇంటిపట్టాలిచ్చి, ఆయా ప్రాంతాల్లో మౌలిక సౌకర్యాలు కల్పించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.ప్రభాకర్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పార్టీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కరెంటు సౌకర్యం కల్పించాలని, డబుల్‌బెడ్‌రూం ఇవ్వాలనే డిమాండ్‌తో నాలుగేళ్ల నుంచి సీపీఐ పేదల పక్షాన పోరాటం చేస్తుందన్నారు. ప్రభుత్వం స్పందించకుంటే ఆందోళనలు తీవ్రతరం చేస్తామన్నారు. అనంతరం కలెక్టర్ రాజర్షిషాను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు నళిని రెడ్డి, రాములు, ఎస్.అరుణ్‌కుమార్, రమేశ్, గణేశ్, రాందాస్, లక్ష్మి పాల్గొన్నారు.

పబ్లిక్ హెల్త్ ఏఈకి పదోన్నతి

కైలాస్‌నగర్: పబ్లిక్ హెల్త్ ఇంజినీరింగ్ విభాగంలో ఏఈగా పని చేస్తున్న అరుణ్ కుమార్‌కు డీఈగా పదోన్నతి లభించింది. ఈ మేరకు ఆ శాఖ రాష్ట్ర ఈఎన్‌సీ ఉత్తర్వులను జారీ చేశారు. కాగా అదే విభాగంలో ఏఈగా పనిచేస్తున్న హరిభువన్ నిర్మల్ జిల్లాకు బదిలీపై వెళ్లారు. వీరిని సోమవారం మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్, పబ్లిక్ హెల్త్ ఈఈ గంగాధర్ జిల్లా కేంద్రంలోని ఆ శాఖ కార్యాలయంలో శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు.

పేదింటి బిడ్డకు ఐదో ర్యాంక్



కడెం: మండలంలోని ఉడుంపూర్‌కు చెందిన బూరుగు వర్ష స్కూల్ అసిస్టెంట్ బయాలజికల్ సైన్స్‌లో 79.07 మార్కులతో ఐదో ర్యాంక్ సాధించింది. బూరుగు హన్మవ్వ–తిరుపతి దంపతుల కూతురు వర్ష ఎలాంటి కోచింగ్ లేకుండా డీఎస్సీకోసం ఇంటి వద్దే ప్రిపేర్ అయింది.

బూరుగు వర్ష

అన్నయ్య ప్రోత్సాహంతో..



నేరడిగొండ: మండల కేంద్రానికి చెందిన తాళ్ల పవన్ ఎస్జీటీలో జిల్లా స్థాయిలో 25వ ర్యాంక్ సాధించాడు. పవన్ అన్నయ్య నరేశ్ ప్రోత్సాహం, మామయ్యల ప్రాద్బలంతో ర్యాంక్ సాధించినట్లు తెలిపాడు. ఎలాంటి కోచింగ్ తీసుకోకుండానే ఇంటి వద్దే సన్నద్ధమైనట్లు పేర్కొన్నాడు.

తాళ్ల పవన్

ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ..



తాంసి: మండలంలోని పొన్నారి గ్రామానికి చెందిన కేమ పోచ్చన్న ఎస్జీటీలో 72.5 మార్కులు సాధించి జిల్లాలో 54 ర్యాంకు సాధించాడు. ప్రైవేట్ ఉద్యోగం చేస్తూనే డీఎస్సీలో అర్హత సాధించారు. కోచింగ్ లేకుండా ఇంటివద్దనే చదివి డీఎస్సీ పరీక్ష రాసి అర్హత సాధించాడు.

కేమ పోచ్చన్న

జిల్లా టాపర్‌గా మైనార్టీ గురుకుల టీచర్



రవిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్, టీచర్లు

భైంసాటౌన్: డీఎస్సీ ఫలితాల్లో భైంసా పట్టణంలోని మైనారిటీ గురుకుల పాఠశాల ఉపాధ్యాయుడు పి రవి జిల్లా టాపర్‌గా నిలిచాడు. సాంఘిక శాస్త్రం స్కూల్ అసిస్టెంట్ విభాగంలో 80శాతం మార్కులు సాధించి, జిల్లా ఫస్ట్ ర్యాంక్ సాధించాడు. మైనారిటీ పాఠశాలలో టీజీటీగా పనిచేస్తుండగా, డీఎస్సీ స్కూల్ అసిస్టెంట్ విభాగంలో జిల్లాలోనే మొదటిర్యాంక్ రావడంతో సోమవారం పాఠశాల ప్రిన్సిపాల్ ఎంఏ జబ్బార్, వైస్ ప్రిన్సిపాల్ సాయినాథ్, ఉపాధ్యాయులు ఆయన్ను అభినందించారు. ఈ సందర్భంగా శాలువాతో సన్మానించారు. ఉపాధ్యాయులు సురేష్, అన్సర్, మెహనాజ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ చాటిన నలుగురు..



దస్తురాబాద్: మున్యాల గ్రామానికి చెందిన బోడ్డు సుమలత ఎస్జీటీలో జిల్లా స్థాయిలో 2వ ర్యాంక్, సుదాం మౌనిక 19వ ర్యాంక్, కోడూరి సుమలత 38వ ర్యాంక్, దోనకంటి సాయి లీలా 128వ ర్యాంక్ సాధించారు. వీరిని కుటుంబీకులు, గ్రామస్తులు అభినందించారు.

– బోడ్డు సుమలత

డీఎస్సీలో సత్తాచాటారు

- ఉమ్మడిజిల్లాలో పలువురు అర్హత
- కష్టపడి చదివి ర్యాంకులు పొందిన యువత



రాష్ట్ర ప్రభుత్వం సోమవారం విడుదల చేసిన డీఎస్సీ ఫలితాల్లో ఉమ్మడి జిల్లాల్లోని యువతీ, యువకులు సత్తాచాటారు. కష్టపడి చదివి అర్హత సాధించి మంచి ర్యాంకులు సాధించారు. కొందరు తొలిప్రయత్నంలో అర్హత సాధించగా, మరికొందరు టీటీసీ పూర్తిచేసి టీచర్ కొట్టాలని కోచింగ్ తీసుకుని డీఎస్సీ పరీక్ష రాసి ప్రతిభ కనబర్చారు.

పేదింటి బిడ్డకి ర్యాంక్



నిర్మల్‌రూరల్: మండలంలోని వెంగ్వాపేట్‌కు చెందిన గడ్డం లక్ష్మి–గడ్డం జీవన్ దంపతుల కుమార్తె అనూష సోషల్ స్టడీస్ స్కూల్ అసిస్టెంట్ విభాగంలో జిల్లాస్థాయిలో 6వ ర్యాంకు సాధించింది. ఆమె విజయం పట్ల కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తంచేశారు.

గడ్డం అనూష

ఎలాంటి కోచింగ్ లేకుండానే..



దండేపల్లి: మండలకేంద్రానికి చెందిన గుర్రం మురళీమోహన్–సుజాత దంపతులు వ్యవసాయం చేస్తుంటారు. వారి కూతురు తేజశ్విని రెండేళ్ల క్రితం టీటీసీ పూర్తిచేసింది. డీఎస్సీ నోటిఫికేషన్ వెలువడింది. ఇంటివద్దనే ఉండి డీఎస్సీకి ప్రిపేర్ అయింది. 76.70 మార్కులు సాధించి, జిల్లా 52వ ర్యాంకు సాధించింది. – గుర్రం తేజశ్విని, దండేపల్లి

నిర్మల్ జిల్లాలో నాలుగవ ర్యాంక్



కుంటాల: కుంటాలకు చెందిన అల్లకొండ హిమబిందు జిల్లాలో నాలుగవ ర్యాంకు సాధించింది. భర్త శ్రీనివాస్ ఆర్ఎంపీ వైద్యుడు. హిమబిందు గతంలో కేజీబీవీ టీచర్‌గా, ప్రస్తుతం భైంసా కేజీబీవీలో జూనియర్ లెక్చరర్‌గా విధులు నిర్వర్తిస్తోంది. ర్యాంకు సాధించిన ఆమెను పలువురు అభినందించారు.

– హిమబిందు

భౌతికశాస్త్రంలో జిల్లా టాపర్‌గా



తాండూర్: మండలంలోని అచ్చులాపూర్‌కు చెందిన ఏకారి ఆంజనేయులు భౌతిక శాస్త్రంలో జిల్లా టాపర్‌గా నిలిచాడు. ఏకారి సత్యనారాయణ–పద్మ దంపతులకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు కాగా కుమారుల్లో ఆంజనేయులు చిన్నవాడు. బజ్జీల బండిపెట్టి వచ్చే కొద్దిపాటి ఆదాయంతో కుటుంబాన్ని పోషిస్తున్నా తల్లిదండ్రులకు చేదోడువాదోడుగా ఉంటూ ఆంజనేయులు కష్టపడి చదివి డీఎస్సీకి ప్రిపేర్ అయ్యాడు. భౌతికశాస్త్రం విభాగంలో జిల్లాలో ఒకే పోస్టు ఉండగా పరీక్ష రాసి జిల్లా టాపర్‌గా నిలిచాడు. తల్లిదండ్రులు, భార్య సంధ్య ప్రోత్సాహంతోనే సాధించానని ఆంజనేయులు తెలిపాడు.

– ఆంజనేయులు

జిల్లాలో ప్రథమ ర్యాంక్



బజార్‌హత్నూర్: బజార్ హత్నూర్‌కు చెందిన పురింశెట్టి నర్సయ్య స్కూల్ అసిస్టెంట్ తెలుగు భాషా పండిత్ సబ్జెక్టులో జిల్లా ప్రథమ ర్యాంక్ సాధించారు. మోర్కండికి చెందిన లోవెకార్ రాహుల్..ఎస్జీటీలో (జనరల్) 106 ర్యాంక్, హిందీ పండిత్ (ఎస్జీటీ)లో 8వ ర్యాంకులు, సర్పె అమోల్ (ఎస్జీటీ జనరల్)కు 41వ ర్యాంకు, దేగామ గ్రామానికి చెందిన నాగరాజు శ్రీనివాస్ ఎస్జీటీలో 44 ర్యాంకు సాధించారు.

పురింశెట్టి నర్సయ్య

తొలి ప్రయత్నంలో..



తాంసి: ఎలాంటి కోచింగ్ లేకుండా ఇంటి వద్ద ప్రిపరేషన్ కొనసాగించి డీఎస్సీ ఫలితాల్లో హిందీ పండిట్ లాంగ్వేజీలో ప్రధాన్ సాయికృష్ణ జిల్లా టాపర్‌గా నిలిచాడు. మండలంలోని గిరిగాం గ్రామానికి చెందిన ఈయన తొలి ప్రయత్నంలోనే 63.73 మార్కులు సాధించాడు. భార్య ఇద్దరు పిల్లలు ఉన్నప్పటికి ఉన్నత చదువులు పూర్తి చేసి డీఎస్సీకి సన్నద్ధమయ్యాడు. పరీక్ష రాసి టాపర్‌గా నిలిచాడు. తల్లిదండ్రులు సనీత,దేవిదాస్ సహకారంతోనే సాధ్యమైందని సాయికృష్ణ తెలిపాడు.

– సాయికృష్ణ

జిల్లాస్థాయిలో 3వ ర్యాంక్



తాంసి: మండలంలోని కప్పర్ల గ్రామానికి చెందిన ఏలేటి జ్ఞానప్రగతి జిల్లాస్థాయితో తెలుగులో 3వ ర్యాంక్ సాధించింది. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో తెలుగులో ఎంఏ పూర్తి చేసింది. కోచింగ్ లేకుండా డీఎస్సీ పరీక్షకు సన్నద్ధమై సత్తాచాటింది. మొదటి ప్రయత్నంలోనే 3వ ర్యాంక్ సాధించిన ఆమెను తల్లిదండ్రులు నర్సమ్మ, శంకర్, గ్రామస్తులు అభినందించారు.

తల్లిదండ్రులతో జ్ఞానప్రగతి

నాన్న ప్రోత్సాహంతో..



బోథ్: మడంల కేంద్రానికి చెందిన బోనగిరి రాజు–పద్మ కుమార్తె సారిక ఎస్జీటీలో జిల్లా స్థాయి రెండవ ర్యాంకు సాధించింది. నాన్న ప్రోత్సాహంతోనే ర్యాంకు సాధించినట్లు సారిక తెలిపింది. చిన్న కిరాణ దుకాణాన్ని నడుపుతూ తనను చదివించారని అంటుంది. కుటుంబీకులు, గ్రామస్తులు సారికను అభినందించారు.

– బోనగిరి సారిక

పట్టుదలతో చదివి



బోథ్: మండలంలోని సొనాల గ్రామానికి చెందిన నిగ నిత్యానంద్ రెడ్డి, సుశీల రెండవ కుమారుడు నిగ పూర్ణచందర్ రెడ్డి ఎస్ఏ బయోసైన్స్ విభాగంలో జిలా ప్రథమ ర్యాంకు సాధించాడు. మూడోసారి డీఎస్సీ పరీక్ష రాస్తే ఈసారి పట్టుదలతో చదివి ఫస్ట్ ర్యాంకు సాధించానని పూర్ణచందర్‌రెడ్డి తెలిపాడు.

– నిగ పూర్ణచందర్ రెడ్డి, సొనాల

కుటుంబ ప్రోత్సాహంతోనే..



బోథ్: ధన్నూర్(బి)కి చెందిన చౌకి (బొంతల) గౌరయ్య, గంగవ్వ రెండవ కుమారుడు చంద్రకాంత్ ఎస్ఏ సోషల్ విభాగంలో జిల్లాస్థాయి 3వ ర్యాంకు, ఎస్ఏ ఇంగ్లిష్‌లో 16వ ర్యాంకు సాధించారు. రెండు సార్లు డీఎస్సీ పరీక్ష రాస్తే కొద్ది మార్కుల తేడాతో రాలేదు. అమ్మమ్మ గంగవ్వ, మేనమామ గంగారం, తన సోదరీమణులు ప్రోత్సాహంతోనే ర్యాంక్ సాధించానన్నాడు. – సీహెచ్ చంద్రకాంత్

తెలుగు బోధించడం కలిసివచ్చింది



బోథ్: సొనాల గ్రామానికి చెందిన యాల్ల చంద్రమోహన్ రెడ్డి తెలుగు లాంగ్వేజ్ పండిత్‌లో జిల్లా స్థాయి 4వ ర్యాంకు సాధించాడు. ఆదిలాబాద్‌లోని ఓ ప్రైవేట్ పాఠశాలలో తెలుగు సబ్జెక్టును బోధిస్తూ డీఎస్సీ పరీక్ష రాసి ర్యాంకు సాధించగలిగాడు.

– చంద్రమోహన్‌రెడ్డి

రెండో ప్రయత్నంలో..



ఇంద్రవెల్లి: మండలకేంద్రంలోని మిలింద్‌నగర్‌కు చెందిన నిరుపేద యువకుడు డొలే పురుషోత్తం ఎస్జీటీ విభాగంలో 18 ర్యాంక్ సాధించాడు. రెండో ప్రయత్నంలో సత్తాచాటాడు. పురుషోత్తంను గ్రామస్తులు ఆభినందించారు.

– పురుషోత్తం

పంచాయతీ సెక్రటరీకి 2వ ర్యాంక్



కడెం: పెద్దూర్‌కు చెందిన చిటేటి నరేశ్ స్కూల్ అసిస్టెంట్ సోషల్ విభాగంలో జిల్లాస్థాయిలో రెండవ ర్యాంక్ సాధించాడు. నరేశ్ ప్రస్తుతం పాత మద్దిపడగ పంచాయతీ సెక్రటరీగా విధులు నిర్వహిస్తున్నాడు. ఓ వైపు ఉద్యోగం చేస్తూ సొంతంగా డీఎస్సీకి ప్రిపేర్ అయి రెండవ ర్యాంక్ సాధించడంపై గ్రామస్తులు, మిత్రులు హర్షం వ్యక్తం చేశారు.

నరేశ్

కానిస్టేబుల్ నుంచి..



నిర్మల్‌ఖిల్లా: కడెం మండలం కల్లెడకు చెందిన దొనకంటి ఓం సాయి ఎస్జీటీ విభాగంలో 82.67 మార్కులతో జిల్లా 4వ ర్యాంకు సాధించాడు. 2018లో కానిస్టేబుల్ కొలువును సాధించాడు. ప్రస్తుతం భైంసాలో సివిల్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తూనే దూరవిద్యతో డిగ్రీ పూర్తిచేశాడు. కానిస్టేబుల్ ఉద్యోగానికి లాంగ్ లీవ్ పెట్టి డీఎస్సీ కోసం ప్రిపేర్ అయ్యాడు.

ఓం సాయి(ఫైల్)

క్లుప్తంగా

డెంగీ లక్షణాలతో వివాహిత మృతి



భైరి శ్రీలత (ఫైల్)

లోకేశ్వరం: మండలంలోని భాగాపూర్ గ్రామానికి చెందిన వివాహిత భైరి శ్రీలత (24) డెంగీజ్వరం లక్షణా లతో మృతి చెందింది. గ్రామస్తులు తెలిపిన వివరాలు..శ్రీలత గత ఐదురో జులుగా డెంగీ జ్వరంతో బాధడుతోంది. లో కేశ్వరంలోని ప్రైవేట్ ఆస్పత్రి వద్దకు తీసుకెళ్లగా వైద్యులు నిర్మల్ ఆస్పతికి తరలించారు. అక్కడి నుంచి హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పతికి తరలించగా చికిత్సపొందుతూ సోమవారం మృతిచెందింది. మృతురాలికి భర్త వినీత్, ఇద్దరు కుమారులు ఉన్నారు.

ఉద్యోగం ఇప్పిస్తానని మోసం చేసిన వ్యక్తిపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: ఉద్యోగం ఇప్పిస్తానని మోసం చేసిన వ్యక్తిపై టూటౌన్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. టూటౌన్ ఎస్సై విష్ణుప్రకాశ్ కథనం ప్రకారం.. కూరగాయల మార్కెట్లో మునీమ్‌గా పనిచేస్తున్న పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన ఎండీ యాకుబ్ 2021 మే 21న తాటిగూడకు చెందిన మహ్మద్ ఇంతియాజ్‌కు వ్యవసాయ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్ ఉద్యోగం ఇప్పిస్తానని రూ.4.50 లక్షలు డిమాండ్ చేశాడు. అతని వద్ద నుంచి మొదట రూ.2.50 లక్షలు తీసుకున్నాడు. తన బాబాయి ఎండీ సలీమ్ వ్యవసాయ కార్యాలయంలో పనిచేస్తాడని, తన ద్వారా ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మబలికాడు. మాయమాటలు చెప్పి డబ్బులు తీసుకుని కనిపించకుండా పోయాడు. బాధితుడికి ఉద్యోగం ఇప్పించకపోగా డబ్బులు సైతం తిరిగి ఇవ్వలేదు. దీంతో బాధితుడు ఫిర్యాదుతో సోమవారం కేసు దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ ఎస్సై తెలిపారు.

రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించాలి

మంచిర్యాలఅగ్రికల్చర్: ప్రభుత్వం రేషన్‌డీలర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మోటపల్కుల సత్తయ్య మాట్లాడారు. రేషన్ డీలర్లకు గౌరవ వేతనంతోపాటు క్వింటాల్‌కు రూ.300 చొప్పున కమీషన్ ఇవ్వాలని, ప్రతీ ఎంఎల్ఎస్ పాయింట్‌లో ఎలక్ట్రానిక్ ప్రింటింగ్‌తో కూడిన వేబ్రిడ్జి ఏర్పాటు చేయాలన్నారు. రూ.10 లక్షల ఇన్సురెన్స్ అమలు చేయాలని, హమాలీ చార్జీలు ప్రభుత్వమే భరించాలన్నారు. ప్రధాన కార్యదర్శి బొమ్మ సత్యనారాయణరెడ్డి, కార్య నిర్వాహకులు సుదమల్ల క్రిష్ణ, పోశం, రావికిశోర్, రావికంటి కిషన్ తదితరులు ఉన్నారు.

ఫైనాన్స్ వేధింపులతో ఒకరి ఆత్మహత్య

భైంసాటౌన్: పట్టణంలోని గోపాల్‌నగర్‌కు చెందిన పాలెప్‌వార్ రాజేశ్ సోమవారం మధ్యాహ్నం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై ప్రదీప్ కథనం ప్రకారం.. రాజేశ్ (39) స్థానికంగా ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తుండగా, ఏడాది క్రితం ప్రైవేట్ ఫైనాన్స్‌లో టాటా మేజిక్ వాహనం కొనుగోలు చేశాడు. ఈఎంఐలు సక్రమంగా చెల్లించకపోవడంతో రెండురోజుల కిందట ఫైనాన్స్ సిబ్బంది హెచ్చరించి వెళ్లిపోయారు. దీంతో మనస్తాపం చెందిన రాజేశ్ ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై పేర్కొన్నారు. భార్య జయశ్రీ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేపడుతున్నట్లు తెలిపారు. మృతుడికి ముగ్గురు కూతుళ్లు ఉన్నారు.

అప్పుల బాధతో వ్యక్తి..

దండేపల్లి: మండలంలోని మామిడిపల్లికి చెందిన కొప్పుల బుచ్చయ్య (50) అప్పుల బాధతో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఎస్సై ఉదయ్‌కిరణ్ కథనం ప్రకారం.. బుచ్చయ్య గత నాలుగేళ్ల క్రితం ఉపాధి నిమిత్తం గల్ఫ్ దేశానికి వెళ్తానని సుమారు రూ.10 లక్షల వరకు అప్పులు చేశాడు. ఆయన మోసపోవడంతో గల్ఫ్ దేశానికి వెళ్లలేదు. దీంతో చేసిన అప్పులు తీర్చేందుకు మేదరిపేట సమీపంలోని 4 గుంటల భూమిని అమ్మాడు. అయినా అప్పులు పూర్తిగా తీరలేదు. అవి తీర్చే మార్గం లేక తీవ్ర మనస్తాపం చెందాడు. ఇంట్లో ఆదివారం రాత్రి పురుగుల మందు తాగి వాంతులు చేసుకున్నాడు. కుటుంబీకులు, స్థానికులు గమనించి, మంచిర్యాల ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. కుమారుడు మహేశ్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



బుచ్చన్న మృతదేహం

అనుమానాస్పదంగా మహిళ మృతి



విజయలక్ష్మి (ఫైల్)

మంచిర్యాలక్రైం: జిల్లాకేంద్రంలోని మేదరీవాడకు చెందిన చింత విజయలక్ష్మి (47) సోమవారం అనుమానాస్పదంగా మృతిచెందింది. సమాచారం అందుకున్న సీఐ బన్సిలాల్ ఘటనస్థలాన్ని పరిశీలించారు. మృతురాలి మెడపై, చేతులపై కమిలిపోయిన గాయాలు ఉన్నాయి. విజయలక్ష్మి భర్త గతంలో మృతి చెందింది. కుమార్తె భవితకు వివాహమైంది. భర్త చనిపోయిన నాటి నుంచి విజయలక్ష్మి ఒంటరిగా ఉంటోంది. గత కొంత కాలంగా ఆమెకు బంధువుల మధ్య ఆస్తి తగాదాలు ఉన్నాయని కుమార్తె భవిత ఆరోపించింది. కుమార్తె ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు

నస్పూర్: బైక్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన సీసీసీ నస్పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై సుగుణాకర్ కథనం ప్రకారం..శ్రీరాంపూర్ బస్టాండ్ ఏరియాకు చెందిన వంగ శ్రీనివాస్(38) బట్టల వ్యాపారి తన మిత్రుడి రాకేశ్‌తో కలిసి ఆదివారం మధ్యాహ్నం బైక్‌పై పని నిమిత్తం మంచిర్యాలకు వెళ్లారు. రాత్రి ఇంటికి తిరిగివస్తుండగా సుమంగళి ఫంక్షన్ హాల్ సమీపంలో జాతీయరహదారి వద్ద బైక్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొంది. శ్రీనివాస్ తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. గాయాలైన రాకేశ్‌ను అసుపత్రికి తరలించారు. భార్య అమృత ఫిర్యాదుతో సోమవారం కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



శ్రీనివాస్ (ఫైల్)

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

దిలావర్‌పూర్: మండలంలోని సిర్గాపూర్ గ్రామ సమీపంలోని కుంటలో సోమవారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు ఏఎస్సై భీంరావు పేర్కొన్నారు. మృతుడు నీలం నలుపు చెక్స్‌తో కూడిన షర్ట్ ధరించి నలుపురంగు ప్యాంటు ధరించి ఉన్నాడని తెలిపారు. అతని వయస్సు 30 నుంచి 40 వయస్సు మధ్య ఉంటుందని, స్థానికుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

గల్లంతైన మహిళ మృతదేహం లభ్యం

బాసర: బాసర గోదావరి నదిలో గతనెల 27న గల్లంతైన మహిళ మృతదేహం లభ్యమైనట్లు పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాలు..నిజామాబాద్ జిల్లా ధర్మారం గ్రామానికి చెందిన కుటుంబ సభ్యులు బాసర గోదావరి నదిలో స్నానానికి వచ్చారు. జయ (41) గోదావరి నదిలో నీటమునిగింది. గజఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టగా, లోకేశ్వరం మండలం బ్రహ్మేశ్వర్ వద్ద గోదావరి నదిలో సోమవారం జయ మృతదేహాన్ని గుర్తించినట్లు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి మొక్కలు పెంచుతున్న వ్యక్తి అరెస్టు

తాండూర్: ఇంటి పరిసరాల్లో గంజాయి మొక్కలు పెంచుతున్న ఓ వ్యక్తిని సోమవారం అరెస్టు చేసినట్లు ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండలంలోని కిష్టంపేట గ్రామానికి చెందిన కామెర దుర్గయ్య తన ఇంటి ఆవరణలో నిషేధిత గంజాయి మొక్కలు పెంచుతున్నట్లు సమాచారం అందింది. వెంటనే సిబ్బందితో వెళ్లి తనిఖీ చేయగా 8 గంజాయి మొక్కలు కనిపించాయి. ఆ మొక్కలను స్వాధీనం చేసుకుని కామెర దుర్గయ్యను అదుపులో తీసుకున్నామని ఎస్సై తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

జోనల్‌స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలు ప్రారంభం



రాష్ట్ర స్థాయికి ఎంపికైన బాలికలు



రాష్ట్ర స్థాయికి ఎంపికైన బాలురు

ఆసిఫాబాద్‌రూరల్: రాష్ట్రస్థాయి పోటీలో రాణించాలని డీఎస్‌వో మీనారెడ్డి, ఎస్జీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివరావు పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని గిరిజన దర్శ క్రీడ పాఠశాలలో ఎస్జీజీఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం అండర్–17 బాల,బాలికలకు జోనల్ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలను ఏసీఎంవో ఉద్దవ్ ప్రారంభించారు. ఈ పోటీలకు ఉమ్మడి జిల్లా నుంచి 84 మంది బాల బాలికలు పాల్గొన్నారని, ఇందులో ప్రతిభ కనబర్చిన 16 మంది బాలురు, 16 మంది బాలికలను రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. వీరికి కొస్గి నారాయణపేట్ జిల్లాలో ఈనెల 3 నుంచి 5 వరకు జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కోచ్ అరవింద్, పీడీలు పీటీలు రాకేశ్, సాయి, దీపిక, విద్యా సాగర్, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

వాగు దాటి.. సర్వే చేసి



వాగు దాటి సర్వే కోసం వెళ్తున్న అధికారులు

నెన్నెల: మండలంలోని గుండ్లసోమారంలో సర్వే నం.117 నుంచి 135వరకు విరాసత్ కోసం రైతులు దరఖాస్తులు చేసుకున్నారు. ఆ దరఖాస్తులను గుర్తించడానికి మండల ఆర్ఐ సులోచన, సర్వేయర్ దశరథం ఎడ్లబండిపై వాగు దాటి వెళ్లారు. సర్వే కోసం రెవెన్యూ అధికారులు ఎడ్లబండిపై వచ్చి సర్వే చేపట్టడం ఆనందంగా ఉందని రైతులు రెవెన్యూ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

గృహిణి మృతిపై విచారణ

నస్పూర్: ఆర్ఎంపీ ఇచ్చిన వైద్యం వికటించి గృహిణి మృతి చెందిన ఘటనపై ప్రభుత్వ వైద్య అధికారులు సోమవారం విచారణ చేపట్టారు. నస్పూర్‌లోని నాగార్జునకాలనీలోని చింతం శ్రీలత (24) మృతి పట్ల వచ్చిన ఆరోపణలపై ఉన్నతాధికారుల ఆదేశాలతో విచారణ చేపట్టామని మెడికల్ ఆఫీసర్ సమత తెలిపారు. మృతురాలి ఇంటి చుట్టుపక్కల వారి నుంచి, ఆర్ఎంపీ ప్రశాంత్ నుంచి వివరాలు సేకరించామని పేర్కొన్నారు. ఆరోగ్య కేంద్రాన్ని, పరిసరాలను పరిశీలించి సేకరించిన రిపోర్టులను ఉన్నతాధికారులకు పంపించనున్నట్లు తెలిపారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో అనిత, సీహెచ్‌వోలు రమేశ్, రామ్మూర్తి, హెల్త్‌అసిస్టెంట్ వెంకట్, ఏఎన్ఎంలు వినోద, సునంద, ఆశవర్కర్ ఉన్నారు.

పోలీస్ బందోబస్తు.

మృతురాలి దహన సంస్కరాల నేపథ్యంలో నాగార్జున కాలనీలో ఎలాంటి అవాంచనీయ ఘటనలు జరుగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. పీఎంపీ క్లినిక్, అతని ఇంటి వద్ద ముందస్తు బందోబస్తు నిర్వహించారు. ఎలాంటి ఆందోళనలు లేకుండా అంత్యక్రియలు ప్రశాంతంగా ముగిసింది. మంచిర్యాల ఏసీపీ ప్రకాశ్, మంచిర్యాల రూరల్ సీఐ ఆకుల అశోక్, సీసీసీ నస్పూర్, శ్రీరాంపూర్, హాజీపూర్ ఎస్సైలు సుగుణాకర్, సంతోష్, సురేశ్, సిబ్బంది పాల్గొన్నారు.



వివరాలు సేకరిస్తున్న వైద్య అధికారులు

ఆర్ఎంపీ రిమాండ్‌కు తరలింపు

చింతం శ్రీలత మృతి చెందిన ఘటనలో ఆర్ఎంపీ ప్రశాంత్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు మంచిర్యాల రూరల్ సీఐ ఆకుల అశోక్ తెలిపారు. మృతురాలి తండ్రి సత్తయ్య ఫిర్యాదుతో ప్రశాంత్‌ను అదుపులో తీసుకుని రిమాండ్‌కు తరలించామన్నారు. సీసీసీ నస్పూర్ ఎస్సై నెల్కి సుగుణాకర్, సిబ్బంది, పాల్గొన్నారు.

ఆర్ఎంపీ క్లినిక్‌కు నోటీసులు

మంచిర్యాలటౌన్: సాక్షిలో 'ఆర్ఎంపీ వైద్యం ...ప్రాణ సంకటం'శీర్షికన వచ్చిన కథనానికి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు సోమవారం స్పందించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి హరీశ్‌రాజ్ మంచిర్యాల డిప్యూటీ డీఎంహెచ్‌వో అనితను విచారణ నిమిత్తం ప్రశాంత్ నిర్వహిస్తున్న నస్పూర్‌లోని క్లినిక్‌ను తనిఖీ చేసి, తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు దాన్ని తెరవద్దంటూ నోటీసులు జారీ చేశారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో మాట్లాడుతూ ఆర్ఎంపీలు, పీఎంపీలు కేవలం ప్రథమ చికిత్స మాత్రమే చేసి, దగ్గరలో ఉన్న ఆరోగ్య కేంద్రానికి పంపించాలన్నారు. అనుమతి లేకుండా ఇష్టారీతిన ఇంజక్షన్లు వేయడం, చికిత్స అందించడం చేస్తే శాఖాపరమైన చర్యలుంటాయని హెచ్చరించారు.



క్లినిక్‌ను పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో